ఆలయ నూతన కమిటీ



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ మోహన్‌రావు కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సార్ల రమేష్, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణగౌడ్ ప్రధాన కార్యదర్శిగా పోచయ్య, కోశాధికారిగా మధు, ఉప కోశాధికారిగా శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా హరిబాబు, రాజుయాదవ్, ఎల్లయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ శాలువాలతో సత్కరించారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించడమే 'మన్‌కీ బాత్'

ఉప్పల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడమే 'మన్‌కీ బాత్' కార్యక్రమమని పలువురు బీజేపీ నేతలు అన్నారు. ఆదివారం ఉప్పల్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మారినేని ఫణీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు డా. శిల్పారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేలా స్క్రీన్ ద్వారా ప్రదర్శించామన్నారు. బీజేపీ సీనియర్ నేత శామీర్‌పేట ధర్మారెడ్డి, తీగ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి '332వ జ్ఞానమాల'

బోడుప్పల్: అంబేడ్కర్ విగ్రహానికి 332వ జ్ఞానమాల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ పాల్గొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రపంచంలోని అత్యున్నత రాజ్యాంగమని, దానిని కొన్ని పార్టీలు మార్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అజయ్‌యాదవ్, నర్సింహారెడ్డి, రమేష్, అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ సమస్యలపై నిరంతర పోరాటం



మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలోని బీసీ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని బీసీ సంఘాల జేఏసీ కో- కన్వీనర్ చంద్రమౌళి అన్నారు. నాచారంలోని బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో జేఏసీ కన్వీనర్ రాజాబాబు ఆధ్వర్యంలో ఛత్రపతి సాహు మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నల్లారాధాకృష్ణ, కరాటే శ్రీరామ్, సిద్ధాక్ సోను, కునుకుంట్ల విజయ్‌కుమార్, బొడ్డు శివ, కనక మేడాల రాజబాబు, అంజిమాదిగ, గద్ద యుగేందర్, అశోక్‌బాబు, రామ్‌కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

బోడుప్పల్: మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నట్లు బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మాతా అరవిందకాలనీలో రూ.8 లక్షలతో సీసీరోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు. శివశంకర్, ఉమేష్‌చారి, నాయకులు సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య

అల్వాల్: కుటుంబసమస్యలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అంబిక తెలిపిన వివరాల ప్రకారం.. పాత అల్వాల్ హరిజన బస్తీలో చిన్న నర్సింహ, రాధా (38) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. కాగా స్థానికంగా చేపలు విక్రయిస్తుంటారు. ఆదివారం ఉదయం ఆమె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన కూచిపూడి ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీనిలయ అకాడమీ ఆఫ్ కూచిపూడి గురువు గీత మాధురి శిష్యబృందంచే నిర్వహించిన ప్రదర్శన అలరించింది. గజవదన, జయము జయము, కొత్వం, వందే వసుదేవం, జతిస్వరం, కులుకగనడవరో, నంద కధర, మరకత, దేశభల్లానా తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

'రైతు సంక్షేమం' ఎక్కడ ?

కొంతమంది రైతులకే రైతు భరోసా
- అందరికీ అమలు కానీ రుణమాఫీ
- మేడ్చల్ జిల్లాలో రైతు పరిస్థితి అగమ్య గోచరం

మేడ్చల్: జిల్లాలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలు అందరికీ అందడం లేదు. మేడ్చల్ సహా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, ఉప్పల్, నియోజకవర్గాలు ఉండగా.. మేడ్చల్ నియోజకవర్గంలో మెజారిటీ రైతులు భూములను సాగుచేస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రైతులు ఉన్నా.. కొంత మేరకు సాగు ఉంది. మిగతా నియోజకర్గాలు హైదరాబాద్‌లో అంతర్భాగంగా ఉన్నాయి.

బోనస్ పడలే..

సన్న వడ్లు పండించిన రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరకు రూ.500 కలిపి బోనస్ ఇస్తామని ప్రకటించినా.. స్థానిక రైతులకు ఇంత వరకు బోనస్ సొమ్ము ఖాతాలలో జమ కాలేదు.

◆ మేడ్చల్ జిల్లాలో గత సీజన్‌లో అధికారులు 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 3,253 టన్నుల సన్న వడ్లు, 13,453 టన్నుల దొడ్డు వడ్లను కొనుగోలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 3,253 టన్నుల సన్న వడ్లను కొనుగోలు చేయగా.. క్వింటాల్‌కు రూ.2,320 బోనస్ రూ.500 కలిపి రూ.2,820 అకౌంట్లలో జమ కావాల్సి ఉండగా.. బోనస్ మినహాయించి రూ.2,320 మాత్రమే అధికారులు జమ చేశారు. ప్రభుత్వం ఇస్తామని చెబుతున్న బోనస్ రూ.500 ఇంత వరకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదు.



రైతు భరోసాకు నోచుకోని రైతులు..

మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 49,000 వేల మంది రైతులు ఉండగా.. అందరూ రైతులు ప్రభుత్వం రైతు భరోసాకు నోచుకోవడం లేదు. తొలి విడతలో కేవలం మూడు చింతలపల్లి మండలానికి చెందిన 4,291 మంది రైతులకు రైతుభరోసా వచ్చింది. రైతులు, రైతు నాయకుల నిరసనలు, ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 20,507 మంది రైతులకు రైతు భరోసా నిధులు వారి అకౌంట్లలో మంగళవారం జమ చేశారు.

◆ తాజాగా ఇప్పటి వరకు మొత్తం 24,798 మంది రైతులకు రైతు భరోసా నిధులు ఇచ్చి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేసింది. జిల్లాలో 49 వేల మంది రైతులు ఉండగా.. 24,202 మంది రైతులు ఇప్పటి వరకు రైతు భరోసాకు నోచుకోవడం లేదు. జిల్లాలో సగం మంది రైతులకు రైతుభరోసా లేకపోవడంతో రైతులు ప్రభుత్వ పెద్దల మాటలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రుణమాఫీ కొందరికే..

జిల్లా వ్యాప్తంగా 49 వేల మంది రైతులు ఉండగా అందులో సగం మంది రైతులు బ్యాంకులు, రైతు సహకార సంఘాల ద్వారా రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకున్నా.. అందరికి రుణమాఫీ కాలేదు. జిల్లాలో కేవలం 4,371 మంది రైతులకు మాత్రమే ఇప్పటి వరకు రుణమాఫీ అయ్యింది. ఔటర్‌కు దగ్గరగా ఉన్న రైతులను ధనిక రైతులనే సాకుతో వారికి రాష్ట్రంలో మిగతా ప్రాంతాల రైతుల మాదిరిగా రైతు భరోసా ఇవ్వకపోవడంపై మేడ్చల్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బోనస్ త్వరలోనే వస్తుంది

జిల్లాలో రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రభుత్వం నుంచి తప్పకుండా వస్తుంది. రైతుల ఖాతాల్లో త్వరలోనే బోనస్ డబ్బులు జమ అవుతాయి. సన్న వడ్ల రైతుల వివరాలు ఇప్పటికే ఉన్నతాధికారులకు అందజేశాం.

– సుగుణబాయి, డీఎం పౌరసరఫరాల శాఖ

అందరికీ రైతు భరోసా

జిల్లాలో రైతు భరోసా పొందడానికి అర్హత ఉన్న ప్రతీ రైతుకు రైతు భరోసా నిధులు మంజూరు అవుతాయి. పంటలు సాగు చేస్తున్న రైతుల ఖాతాల్లోకి డబ్బులు వస్తాయి.

– చంద్రకళ, జిల్లా వ్యవసాయాధికారి

కొందరికే సంక్షేమ పథకాలు



డబీల్‌పూర్ సొసైటీ పరిధిలో 1800 మంది రైతులు ఉండగా.. కొంత మందికే కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ప్రభుత్వం రైతుల కోసమని చెబుతున్నా సగం మందికే సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

– సురేష్‌రెడ్డి, డబీల్‌పూర్ రైతు సహకార సంఘం చైర్మన్

శివారు ప్రాంతాల్లో ఉంటే రైతులం కాదా.. ?



నగర శివార్లలో పుట్టడమే మేడ్చల్ రైతుల దురదృష్టమా.. ఉన్న రెండెకరాల్లో సాగు చేసుకుని పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారు రైతులు కాదా.. మేడ్చల్ రైతులకు ప్రభుత్వం నుంచి అందుతున్న అన్ని సంక్షేమ పథకాలను భేషరుతుగా అమలు చేయాలి.

– నర్సింహ్మారెడ్డి, రైతు అత్వెల్లి

బోనస్ వెంటనే అందజేయాలి



పాలకులు తమ మాటల్లో కాకుండా రైతుల సంక్షేమాన్ని చేతల్లో చేసి చూపాలి. గతంలో మాదిరిగానే అందరికీ రైతు సంక్షేమ పథకాలు అన్నీ అమలు చేయాలి. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ వెంటనే అందజేయాలి. రైతులు ఇప్పటికే రైతు భరోసా కోసం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. రోడ్డెక్కే పరిస్థితి తీసుకురావొద్దు.

– రందీప్‌రెడ్డి, మేడ్చల్ రైతు సహకార సంఘం చైర్మన్

విద్యుత్ తీగలతో ప్రమాదం !

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి రేకుల బావి వద్ద పొలాల్లో కరెంట్ స్తంభం విరిగి కరెంట్ తీగలు భూమిని తాకుతూ.. ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ సరఫరా చేసే స్తంభం ధాబా హోటల్ వెనుక చెట్ల మీదకు స్తంభం ఒరిగింది. దీంతో సమీప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత నెలలోనే తెగిపడ్డ తీగలకు తగిలి రెండు పాడి గేదెలు మృతి చెందాయి. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం లేదని ప్రజలు వాపోతున్నారు.



నేలను తాకేలా విద్యుత్ తీగలు

దీనిపై అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం !



చాంద్‌బాగ్ కాలనీలోని రహదారి మధ్యలో..

మౌలాలి: రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తక్షణమే తొలగించాలని కాలనీవాసులు కోరారు. మౌలాలి డివిజన్ చంద్‌బాద్ కాలనీలో 30 ఫీట్ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండటంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని, రాత్రి సమయంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించాలని, రహదారికి ఆటంకం లేకుండా ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ నాయకుడు వంశీముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించామన్నారు. బీఆర్‌ఎస్ నేతలు దుర్గేష్, స్వామిలతో పాటు చాంద్‌బాగ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక

మల్కాజిగిరి: దయానంద్‌నగర్ రైల్వేస్టేషన్ వద్ద ఈస్ట్ ప్రాంతంలో నిర్మించిన నూతన హాల్టింగ్ స్టేషన్‌కు రాధాకృష్ణనగర్ పేరు పెట్టడానికి కృషి చేసిన ఎమ్మెల్యేను ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సన్మానించారు. ఈనెల 26న జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించారని, అందుకు ఎమ్మెల్యే కృషిచేశారని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్, రవికిరణ్‌లు తెలిపారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్,




ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కాలనీవాసులు

వెంకన్న, రాముయాదవ్, సంఘం నాయకులు రంగారావు, రాఘవేంద్రగుప్తా, విజయ్‌కుమార్, శివకుమార్, సంజయ్, సాయినాథ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి బస్తీబాట

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని లింగమయ్యనగర్ కాలనీలో బస్తీ సమస్యల పరిష్కారానికి గ్రేటర్ కాంగ్రెస్‌నేత నెమలి అనీల్‌కుమార్ 'బస్తీబాట' నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ చైర్మన్ ఎంఏ ముజీబ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, నేతలు మక్తాల బాలరాజ్‌గౌడ్



లింగమయ్యనగర్ కాలనీలో పర్యటిస్తున్న అనీల్‌కుమార్

శ్రీనివాస్‌గౌడ్ కొండ రాజేష్, శివ, వెంకట్, రఘు, సాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని సుభాష్‌నగర్ కాలనీలో రూ.30.50 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఆదివారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయంలో 100 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. కాలనీవాసులు సాయిలు, గంగాధర్, తిరుమలయ్య, బాలనర్సింహ, పోచయ్య, కృష్ణ, శంకర్, మల్లేష్, ప్రభు, నరేష్, భాను, లలిత, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు పూలమాల సమర్పణ

ఘట్‌కేసర్: ప్రబుద్ధ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు పూలమాల కార్యక్రమం సీపీఎం జిల్లా నాయకుడు చింతల యాదయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఓ వర్గానికి చెందిన వ్యక్తి కాదని, అన్ని వర్గాలకు ఆదర్శమూర్తి అని కొనియాడారు. దేశ సంపద అన్ని వర్గాలకు సక్రమంగా సమరీతిలో పంపిణీ జరగాలని ఆకాంక్షించారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మేకల దాస్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు, అంబేడ్కర్ అభిమాన సంఘ ప్రతినిధులు సబిత, కడమంచి యాదగిరి, గణేష్, జగదీష్, నర్సింగ్‌రావు, గణేష్‌గౌడ్, నిఖిల్, ఉపేందర్, అఖిల్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాలీసెట్ కౌన్సెలింగ్

రామంతాపూర్ : తెలంగాణ పాలిటెక్నిక్ తొలివిడత కౌన్సెలింగ్ ఆదివారం ముగిసింది. రామంతాపూర్‌లోని ప్రభుత్వ జవహర్‌లాల్ నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం 510 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సెలింగ్ హెల్ప్ డెస్క్ కో-ఆర్డినేటర్ ప్రిన్సిపల్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు జూలై 1 వరకు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని, జూలై 4 నుంచి 6 వరకు అభ్యర్థులకు సీట్లు కేటాయించిన కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మల్లాపూర్: జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు గణేష్ పిలుపునిచ్చారు. ఆదివారం సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. నరేష్, బాలరాజ్, సోమయ్య, శ్రీనివాస్, నరసింహ, కుమార్, రాజు, అంజయ్య, ఎల్లయ్య, ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలపై సమావేశం

బోడుప్పల్: బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు గ్రామపెద్దలు బంగారు మైసమ్మ దేవాలయంలో సమావేశం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్న తర్వాత ఈసారి పెద్ద పండగను వైభవంగా నిర్వహించేందుకు తీర్మానించారు. ఆగస్టు 3న బోనాల జాతర, 4న పెద్ద పండుగ (రంగం కార్యక్రమం)ను నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, బీ- బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, నేతలు బొబ్బల లక్ష్మారెడ్డి, జంగారెడ్డి, రాసాల వెంకటేష్‌యాదవ్, యాదగిరి, బొమ్మక్ రమేష్ తదితరులున్నారు.

నాటుతున్నారు.. తొలగిస్తున్నారు !



గుండ్లపోచంపల్లి-డబీల్‌పూర్ రోడ్డు పక్కన నరికివేసిన చెట్ల కొమ్మలు

మేడ్చల్: ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు చెట్లు నాటి, తీరా అవి పెరగాక రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని, కరెంట్ తీగల కింద ఉన్నాయని తొలగించడం పరిపాటిగా మారుతోంది.

◆ మేడ్చల్, ఎల్లంపేట్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల పరిధిలోని గుండ్లపోచంపల్లి శివారు నుంచి అయోధ్య చౌరస్తా వరకు, ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని బండమాదారం నుంచి డబీల్‌పూర్ వరకు, మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలలో రోడ్లపై గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. గత ప్రభుత్వహయాంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రాంతాల రోడ్లలో అధికారులు మొక్కలు నాటారు. ప్రస్తుతం అప్పట్లో నాటిన మొక్కలు చెట్లుగా మారి, రోడ్లపైకి రావడంతో వాటిని తొలగిస్తున్నారు.

రెండేళ్లలో ఏపుగా పెరిగి..

రెండేళ్లలో ఏపుగా పెరిగి, విద్యుత్ తీగలకు తాకుతుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయని, కొమ్మల నరికివేత పేరుతో విద్యుత్ అధికారులు ఏపుగా పెరిగిన మొక్కలను పూర్తిగా నరికేస్తున్నారు. రెండు శాఖల సమన్వయ లోపంతో ఏటా లక్షలాది రూపాయలు వృథా అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజాధనంతో మొక్కలు నాటే సమయంలో ముందుచూపుతో నాటాలని ప్రజల తరుపున డిమాండ్లు వినిపిస్తున్నాయి.

రూ.80 లక్షలతో నాలా పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న తోటకూర వజ్రేష్‌యాదవ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 1వ వార్డులోని నాలా పనులకు తోటకూర వజ్రేష్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కాలనీల అభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, 1వ వార్డు ఇన్‌చార్జి మజార్, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

జలమండలి అధికారులతో సమీక్ష

మల్లాపూర్: నాచారం డివిజన్‌లోని ప్రధాన సమస్యలు, భూగర్భడ్రైనేజీ, తాగునీటి సరఫరాపై వార్డు కార్యాలయంలో నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ జలమండలి మేనేజర్‌తో కలిసి సమీక్షించారు. నూతనంగా మంజూరైనా డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. తాగునీటి పైపులైన్ల కోసం అవసరమైన చోట ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, జలమండలి సూపర్‌వైజర్ శివ,



జలమండలి మేనేజర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి

రాకేష్, విఠల్‌యాదవ్, భూపాల్‌రెడ్డి, కట్టబుచ్చన్న, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఫైళ్ల ఆశయ్య రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మేడిపల్లి: మేడిపల్లి మండల రజక వృత్తిదారుల సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని మేడిపల్లిలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫైళ్ల ఆశయ్య హాజరై మాట్లాడుతూ.. నేటికి రాష్ట్రంలోని అనేక గ్రామాల్లో రజకులు కుల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వృత్తిదారులు పేదరికంలో మగ్గుతున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రజకులకు మోడ్రన్ దోభీఘాట్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉచిత విద్యుత్ పథకం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కమిటీ..

మేడిపల్లి మండల నూతన కమిటీని ప్రకటించగా.. మేడిపల్లి మండల రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా చక్రపాణి, ముఖ్య సలహాదారుడిగా ఎల్లయ్య, కమిటీ ఉపాధ్యక్షుడిగా భిక్షపతి, మహేష్, 20 మంది నూతన కార్యవర్గసభ్యులను ప్రకటించారు. మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సుభద్ర, కార్యదర్శి జ్యోతి, ఉపేందర్, సహాయ కార్యదర్శి రవి, జ్యోతి, దుర్గయ్య, రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును తొలగించాలని నిరసన

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ హిందూ శ్మశాన వాటికలో డంపింగ్ యార్డును తొలగించాలని స్థానికులు నిరసనకు దిగారు. ఆదివారం వారికి మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మల్లారెడ్డిలు హాజరై నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ శ్మశానవాటికలో చెత్త డంపింగ్‌ను వెంటనే నిలిపేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జేఏసీ అధ్యక్షులు ఉదయ్‌ప్రకాష్, సుధాకర్, పుష్పవతి, రమేష్, కరుణశ్రీ, రాజశేఖర్



నిరసనలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

రెడ్డి, ఆనంద్‌రావు, అనురాధ, జయలక్ష్మి, స్వప్న, రాజిరెడ్డి, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలి !




కార్యక్రమంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

మల్కాజిగిరి: ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని జిల్లా పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్కాజిగిరి బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు ఆధ్వర్యంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఏడాదిన్నర పాలన ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జరిగిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, పనితీరును ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఇన్‌చార్జ్‌లు మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్, నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్ జితేంద్రనాథ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వినాయక ఆలయంలో యాగశాల ప్రారంభం

గౌతంనగర్: డివిజన్ గోపాల్‌నగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన యాగశాల ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్‌లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరెడ్డి రూ.2 లక్షల విరాళం అందజేశారు. నాయకులు మేకల రాముయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



యాగశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత